తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT








సంపుటి: 1 సంచిక: 56 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: తెలంగాణ గురువారం 26 -9-2024 వెల: 5/రూ -


# రెండు నెలల్లో.. మరో 35 వేల ఉద్యోగాలు..

వచ్చే రెండు నెలల్లో మరో 35 వేల ఉద్యోగ నియామకాల దిశగా..

విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత

వచ్చే ఏడాది నుంచి డిగ్రీ, ఇంజనీరింగ్‌లో ఇంటర్న్‌షిప్..

కనీస ప్రమాణాల్లేని ఇంజనీరింగ్ కాలేజీల గుర్తింపు రద్దు

ఉపాధి లేక వ్యసనాల బారిన పడుతున్న యువత..

బీఎఫ్ఎస్ఐ స్కిల్ ప్రోగ్రాం ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: వచ్చే రెండు నెలల్లో మరో 35 వేల ఉద్యోగ నియామకాల దిశగా.. ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రపంచానికి నైపుణ్యమున్న యువతను అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆయన వెల్లడించారు.

2లో



## విచారణ చేపట్టండి

సిద్ధరామయ్య పాత్రపై 3 నెలల్లోపు నివేదిక ఇవ్వండి

లోకాయుక్త పోలీసులను ఆదేశించిన బెంగళూరు ప్రత్యేక న్యాయస్థానం

బెంగళూరు: మైసూరు పట్టణాభివృద్ధి ప్రాధికార సంస్థ (ముడా) స్థలాల పంపిణీలో అక్రమాలు జరిగాయన్న ఉదంతంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను విచారించేందుకు రంగం సిద్ధమైంది. సిద్ధరామయ్యను విచారించాలని లోకాయక్త పోలీసులకు బుధవారం బెంగళూరు ప్రత్యేక కోర్టు ఆదేశాలిచ్చింది. దీంతో సిద్ధూపై ఎఫ్ఐఆర్ నమోదుచేసి కేసు విచారణను లోకాయుక్త పోలీసులు మొదలుపెట్టనున్నారు. సిద్ధూ భార్యకు ప్రభుత్వ వెంచర్లలో 14 ప్లాట్లను

2లో

# దాడులు ఉగ్ర రూపం

మొస్సాద్ ఆఫీసుపై హెజ్బొల్లా దాడి

ఇజ్రాయెల్ దాడిలో 51 మంది మృతి

హెజ్బొల్లాను తరిమి కొడతాం: ఐడీఎఫ్



బీరుట్: ఇజ్రాయెల్–హెజ్బొల్లా పరస్పర దాడులు బుధవారం మరింత ఉద్ధృతంగా మారాయి. హెజ్బొల్లా ఉగ్రవాదులు డజన్ల కొద్దీ రాకెట్లను ఇజ్రాయెల్ పైకి ప్రయోగించారు. టెల్ అవీవ్ సమీపంలోని ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్ ప్రధాన కార్యాలయంపైకి బాలిస్టిక్ క్షిపణినిని ప్రయోగించామని హెజ్బొల్లా ప్రకటించింది. దీనిని అడ్డుకున్నట్లు ఇజ్రాయెల్ వెల్లడించింది. హెజ్బొల్లా ప్రయోగించిన వందలాది ప్రొజక్టైల్స్ వల్ల ఇజ్రాయెల్‌లోని అనేక భవనాలు, ఇండ్లు ధ్వంసమైనట్లు, అనేక మంది ప్రజలు గాయపడినట్లు తెలుస్తున్నది. ఇజ్రాయెల్ బుధవారం జరిపిన దాడుల్లో 51 మంది మరణించారని, 223 మంది గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్య మంత్రి తెలిపారు.

- మిగతా 2వ పేజీలో


## తొలిరోజు 285 దరఖాస్తులు 30 పరిష్కారం

గాంధీభవన్‌లో మంత్రులతో ముఖాముఖి కార్యక్రమం ప్రారంభం

ప్రజలు, కార్యకర్తల నుంచి అర్జీలు తీసుకున్న మంత్రి దామోదర రాజనర్సింహ

ఆస్పత్రులు, పోలీస్ స్టేషన్‌లకు ఫోన్లు చేసి పలు సమస్యల పరిష్కారం

మంత్రులతో ముఖాముఖి నిరంతరంఉంటుంది: టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్



2లో

## చంద్రబాబు పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు పూజలు: వైఎస్ జగన్

చంద్రబాబు పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు 28న ఆలయాల్లో పూజలు

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ పిలుపు



అమరావతి: తిరుమల పవిత్రతను, ప్రసాదం విశిష్టతను చంద్రబాబు అపవిత్రం చేసినందుకు, ఆయన పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో



## హైడ్రా పేరుతో హైడ్రామాలు: కేటీఆర్

రాష్ట్ర ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

పేదలకో న్యాయం.. పెద్దలకో న్యాయమా?

బుల్డోజర్లకు అడ్డం పడైనా పేదలకు న్యాయం చేస్తాం

'మూసీ' పేరుతో భారీ కుంభకోణానికి తెరలేపారు

హైదరాబాద్: హైడ్రా పేరుతో ప్రభుత్వం హైడ్రామాలు ఆడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు మండిపడ్డారు. సామాన్యులకు అన్యాయం జరిగే పక్షంలో బుల్డోజర్లకు అడ్డం పడన్నా న్యాయం జరిగేంతవరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఆక్రమణలకు తప్పుడు అనుమతులు ఇచ్చింది కాంగ్రెస్ వారేనని చెప్పారు.

2లో

# వరదల నష్టం రూ.7,600 కోట్లు

4 లక్షల మందికి రూ.602 కోట్ల పరిహారం విడుదల

దాతల నుంచి ప్రభుత్వానికి రూ.400 కోట్ల విరాళాలు

30 నాటికి బాధితులకు పరిహారం పంపిణీ పూర్తి



సాయంపై కేంద్రంలో ఇంకా కసరత్తు జరుగుతోంది: సీఎం

శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే ఊరుకోం

ఒళ్లు దగ్గర పెట్టుకోమని హెచ్చరిస్తున్నాం

క్రిమినల్ బ్రెయిన్‌తో వస్తే వదిలిపెట్టేది లేదు

చొక్కా పట్టుకొని తీసుకెళ్తాం

నేరాలు చేయాలనుకుంటే అదే చివరి రోజు

ఈ పని చేసినందుకు క్షమాపణ చెప్పరా?

ఇప్పుడు మళ్లీ అనంతలో రథం తగలబెట్టారు

అమరావతి: అనంతపురం జిల్లాలో రామాలయానికి చెందిన రథానికి నిప్పంటించిన ఘటనతో పాటు ప్రకాశం బ్యారేజీని బోట్లు ఢీకొన్న ఘటనపైనా సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వరదల్లో నష్టపోయిన 4లక్షల మంది బాధితులకు బుధవారం రూ.602 కోట్ల పరిహారాన్ని విడుదల

2లో

# విచారణ చేపట్టండి

(మొదటి పేజీ తరువాయి)

అక్రమంగా కేటాయించారన్న ఫిర్యాదుల మేరకు సిద్ధూపై విచారణకు కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాత్ అనుమతి ఇవ్వడాన్ని సిద్ధూ కర్ణాటక హైకోర్టులో సవాల్ చేయడం, ఆయన పిటిషన్‌ను కోర్టు కొట్టేయడం తెల్సిందే. ఈ నేపథ్యంలో బుధవారం బెంగళూరు ప్రత్యేక కోర్టు జడ్జి సంతోశ్ గజానన్ భట్ ఆదేశాలిచ్చారు. ఆర్టీఐ కార్యకర్త స్నేహమయి కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాజీ, సిట్టింగ్ ఎమ్మెల్యేలు/ఎంపీల సంబంధిత కేసులను విచారించే ఈ కోర్టు తదుపరి చర్యలకు ఆదేశాలిచ్చింది. మూడు నెలల్లోగా అంటే డిసెంబర్ 24వ తేదీకల్లా సమగ్ర దర్యాప్తు జరిపి నివేదికను సమర్పించాలని జడ్జి సూచించారు. ముఖ్యమంత్రిపై ఉన్న ఫిర్యాదులపై ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని స్పెషల్ కోర్టుకు ఆగస్ట్ 19న తాము ఇచ్చిన ఆదేశాలను హైకోర్టు తాజాగా ఉపసంహరించుకోవడంతో స్పెషల్ కోర్టు బుధవారం ఆదేశాలు ఇవ్వడానికి వీలు కల్గింది. ఈ కేసులో సిద్ధరామయ్య భార్య బీఎం పార్వతి, పార్వతి సోదరుడు మల్లికార్జున స్వామి, స్వామికి ఈ భూమిని అమ్మిన దేవరాజులను ప్రతివాదులుగా కోర్టు చేర్చింది. దర్యాప్తు మొదలుపెట్టాలని లోకాయుక్తకు ఆదేశాలు రావడంపై సిద్ధరామయ్య స్పందించారు. " ఎలాంటి దర్యాప్తునైనా ఎదుర్కొనేందుకు సిద్ధమని గతంలోనే చెప్పా. ఎలాంటి దర్యాప్తునకు నేను భయపడను. చట్టప్రకారం పోరాటానికి నేను సిద్ధం. కోర్టు ఉత్తర్వుల కాపీలో ఏముందో చదివాక మళ్లీ మాట్లాడతా" అని సిద్ధరామయ్య అన్నారు.

# దాడులు ఉగ్ర రూపం

(మొదటి పేజీ తరువాయి)

తాత్కాలిక శిబిరాల్లో 27 వేల మందికి ఆశ్రయం కల్పించినట్లు లెబనాన్ అధికారులు చెప్పారు. హెజ్బొల్లా రాకెట్-మిస్సైల్ విభాగాధిపతి కమాండర్ ఇబ్రహీం ఖబాయిసి ఇజ్రాయెల్ వైమానిక దాడిలో మరణించాడు. ఇబ్రహీంతోపాటు ఇద్దరు హెజ్బొల్లా హై ర్యాంక్ కమాండర్లు మరణించారని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ ఐదు రోజుల నుంచి నిర్వహిస్తున్న దాడుల వల్ల 90 వేల మందికిపైగా ప్రజలు నిర్వాసితులయ్యారని ఐక్యరాజ్య సమితి తెలిపింది. ఏడాదిలో సుమారు 2 లక్షల మంది నిర్వాసితులయ్యారని చెప్పింది. హెజ్బొల్లా ఉగ్రవాద సంస్థతో ఉద్రిక్తతలు పెరుగుతుండటంతో రిజర్వు దళాలను సమాయత్తం చేస్తున్నట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. దీంతో లెబనాన్‌పై మరింత భీకరంగా ఇజ్రాయెల్ దాడి చేయబోతున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి.

# చంద్రబాబు పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు పూజలు: వైఎస్ జగన్

(మొదటి పేజీ తరువాయి)

ఈ నెల 28న (శనివారం) ప్రత్యేక పూజలు చేయాలని వైఎస్సార్‌సీపీ పిలుపునిచ్చింది. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. తిరుమల పవిత్రతను, వేంకటేశ్వర స్వామి వారి ప్రసాదం విశిష్టతను, స్వామి వారి వైభవాన్ని, టీటీడీ పేరు ప్రఖ్యాతులను, వేంకటేశ్వర స్వామి ప్రసాదమైన లడ్డూ పవిత్రతను చంద్రబాబు రాజకీయ దుర్బుద్ధితో అపవిత్రం చేశారని అన్నారు. కావాలని అబద్ధాలాడి, జంతువుల కొవ్వుతో కల్తీ జరగనిది జరిగినట్టుగా చిత్రీకరిస్తున్నారని, ఆ కల్తీ ప్రసాదాన్ని భక్తులు తిన్నట్టుగా అసత్య ప్రచారంతో ముఖ్యమంత్రి హోదాలో ఉన్న చంద్రబాబు తిరుమలను, తిరుమల లడ్డూను, వేంకటేశ్వరస్వామి విశిష్టతను అపవిత్రం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు చేసిన ఈ పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో శనివారంనాడు ప్రత్యేక పూజలు చేయాలని పిలుపునిస్తూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ట్వీట్ చేశారు.


# తొలిరోజు 285 దరఖాస్తులు... 30 పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: పార్టీ కార్యకర్తలు, ప్రజల సమస్యల పరిష్కారం కోసం టీపీసీసీ ఆధ్వర్యంలో బుధవారం 'మంత్రులతో ముఖాముఖి'కార్యక్రమం ప్రారంభమైంది. తొలిరోజు కార్యక్రమానికి హాజరైన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రజల నుంచి 4 గంటల పాటు దరఖాస్తులు తీసుకున్నారు. దాదాపు 285 దరఖాస్తులు రాగా, అందులో 30కి పైగా సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించారు. ఇందుకోసం బాధితుల సమక్షంలోనే ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులతోపాటు పోలీస్ స్టేషన్లకు ఫోన్లు చేసిన దామోదర.. వెంటనే సమస్యలు పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంలో దరఖాస్తులు ఇచ్చేందుకు ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తరలివచ్చారు. ముఖ్యంగా 317 జీవో కారణంగా ఇబ్బందులు పడుతున్న గురుకుల ఉపాధ్యాయులు, పలు ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు వచ్చి తమ అర్జీలను అందజేశారు. ఇందిరమ్మ ఇళ్లు కావాలని, వ్యక్తిగత ఆరోగ్య సమస్యలను పరిష్కరించాలని, రేషన్‌కార్డులు కావాలని, ఉపాధి కల్పించాలని, చిన్నారుల ఆరోగ్య సమస్యలకు సాయం చేయాలని, 108 సిబ్బందికి ఏఎన్‌ఎం ఉద్యోగ నోటిఫికేషన్లలో వెయిటేజీ ఇవ్వాలని కోరుతూ పలువురు దరఖాస్తులు సమర్పించారు. గత పదేళ్లలో తమపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయించాలని మాజీ సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు వినతిపత్రం అందజేశారు. తొలిరోజు వచ్చిన దరఖాస్తులన్నింటినీ కంప్యూటరీకరించామని, ఎప్పటికప్పుడు ఈ సమస్యల పరిష్కార దశలను తెలుసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు గాంధీభవన్ వర్గాలు చెప్పాయి. గాంధీభవన్‌లో ప్రజావాణి చేపట్టడం అద్భుతమైన ఆలోచన అని మంత్రి దామోదర రాజనర్సింహ వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమాన్ని చేపట్టిన టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్‌ను అభినందించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రజల సమస్యలను పరిష్కరించే మాట అటుంచితే కనీసం వారి గోడు వినేవారు కూడా లేరని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ ఇప్పుడు తాము ప్రజల సమస్యలు విని పరిష్కరించే దిశలో అడుగులు వేస్తున్నామని చెప్పారు. వచ్చిన దరఖాస్తులన్నింటినీ ఆయా శాఖలకు పంపుతామని, వీలున్న దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు కుమార్‌రావు, ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు, కార్యకర్తలంటే ఎంతో గౌరవమని, అందుకే వారి సమస్యల పరిష్కారం కోసం గాంధీభవన్‌లో ప్రజావాణి లాంటి కార్యక్రమాన్ని చేపట్టామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు.

# రెండు నెలల్లో.. మరో 35 వేల ఉద్యోగాలు..

(మొదటి పేజీ తరువాయి)



గత పదేళ్లలో రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో రాష్ట్రంలో కొంత మంది యువత గంజాయి, డ్రగ్స్‌కు బానిసలయ్యారని.. ఇటీవల పట్టుబడిన డ్రగ్ పెడ్లర్లలో ఇంజనీరింగ్ విద్యార్థులు ఉండటం ఆందోళన కలిగించిందని ఆవేదన వెలిబుచ్చారు. వ్యసనాల నుంచి యువతను బయటపడేయాలంటే ఉపాధి కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. హైదరాబాద్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చడంతో పాటు నైపుణ్యాల అభివృద్ధికి చిరునామాగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. బుధవారం ఇక్కడి జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఆడిటోరియంలో బీఎఫ్ఎస్ఐ (బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్) స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. బీఎఫ్ఎస్ఐ వెబ్‌సైట్‌ను, కోర్సులతో కూడిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో గత పదేళ్లలో నిరుద్యోగం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్లోనే 30 లక్షల మంది నిరుద్యోగులు తమ వివరాలను నమోదు చేసుకున్నారని, రాష్ట్రంలో దాదాపు 50 లక్షల మంది నిరుద్యోగులు వీధిన పడే పరిస్థితి వచ్చిందని ఆందోళన వెలిబుచ్చారు. రాష్ట్రంలోని నిరుద్యోగ సమస్య తీవ్రతను తమ ప్రభుత్వం గుర్తించి.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై దృష్టి సారించిందని ఆయన పేర్కొన్నారు. తాము అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే 30 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చామని గుర్తుచేశారు. డీఎస్సీ, గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3, తదితర ఉద్యోగాలన్నీ కలిపి మరో 35 వేల ఖాళీల భర్తీ ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోందని.. ఇందుకు సంబంధించిన అన్ని చర్యలనూ ప్రభుత్వం తీసుకుంటోందని వివరించారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలున్న యువతను తీర్చిదిద్ది, వారి ఉపాధికి భద్రత కల్పించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇందు లో భాగంగానే బీఎఫ్ఎస్ఐ ప్రతినిధులతో చర్చలు జరిపామని, వారు ఇచ్చిన ప్రతిపాదనలతో ఈ వినూత్న కార్యక్రమం చేపట్టామని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పుడు డిగ్రీలో చేరిన పదివేల మంది డిగ్రీ విద్యార్థులూ పట్టా పొందే నాటికి.. తగిన నైపుణ్యాలను నేర్చుకునేలా ఈ కార్యక్రమాన్ని రూపొందించామని.. 38 కాలేజీల్లో శిక్షణ పొందిన విద్యార్థులకు బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీస్, ఇన్సూరెన్స్ రంగంలో ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. ఇందుకు అవసరమైన నిధులను ఇచ్చేందుకు ముందుకు వచ్చిన ఎక్విప్ సంస్థ, ఈ కోర్సు సిలబస్‌ను రూపొందించిన బీఆర్ఎస్ఎఫ్ ప్రతినిధులను సీఎం అభినందించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

తెలంగాణలో ఏటా మూడు లక్షల మంది విద్యార్థులు డిగ్రీ పట్టాలు పొంది కాలేజీల నుంచి బయటకు వస్తున్నా.. పరిశ్రమల అవసరాలకు తగిన నైపుణ్యాలు లేకపోవడంతో ఉద్యోగాలు పొందలేకపోతున్నారని సీఎం ఆందోళన వెలిబుచ్చారు. అదే సమయంలో అటు పరిశ్రమలు కూడా తగిన సాంకేతిక నైపుణ్యమున్న ఉద్యోగులు దొరక్క ఇబ్బంది పడుతున్నాయని.. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందని చెప్పారు. అందులో భాగంగానే.. డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు వచ్చే ఏడాది నుంచి ఇంటర్న్‌షిప్ ప్రవేశపెట్టాలని నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. రాష్ట్రంలోని కొన్ని ఇంజనీరింగ్ కళాశాల్లో విద్యార్థులకు ఉద్యోగ నైపుణ్యాలను నేర్పడం లేదని, వసతులు ఉండటం లేదని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. కళాశాలలు ఇలాగే కొనసాగితే వాటి గుర్తింపును రద్దు చేస్తామని హెచ్చరించారు.

టాటా టెక్నాలజీస్ సహకారంతో ఐటీఐలను నవీకరించి 'అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు'గా మారుస్తున్నామని చెప్పిన సీఎం.. ఇప్పటికే మల్లేపల్లి ఐటీఐలో దీనికి సంబంధించి పైలెట్ ప్రాజెక్టు అమలు చేసినట్లు వివరించారు. రాబోయే రెండేళ్లలో రాష్ట్రంలోని అన్ని ఐటీఐలనూ ఏటీసీలుగా మారుస్తామని ఆయన హామీ ఇచ్చారు. త్వరలోనే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటు చేసి తెలంగాణను దేశానికే రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదివి, ప్రపంచంలోనే అతి పెద్ద సంస్థల చీఫ్‌లుగా ఎదిగిన సత్య నాదేళ్ల, అజీమ్ ప్రేమ్‌జీ, శంతను నారాయణ, అజయ్‌బంగా (ప్రపంచ బ్యాంకు చైర్మన్) తదితర ప్రముఖులతో డిసెంబర్‌లో ప్రత్యేక సదస్సు ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. రానున్న కొద్ది సంవత్సరాల్లో బ్యాంకింగ్, ఫైనాన్స్, ఇన్స్యూరెన్స్ రంగాల్లో ఐదు లక్షల మంది దాకా.. శిక్షణ పొందిన అభ్యర్థుల అవసరం ఉంటుందని చెప్పారు. ఆయా ఖాళీల భర్తీకి నైపుణ్యం కలిగిన వారిని తయారు చేయగలిగితే రాష్ట్రంలో భారీగా ఉపాధి అవకాశాలు కల్పించవచ్చున్నారు. కాగా..ఎక్విప్ సంస్థ ప్రతినిధులు రూ. 2. 5కోట్ల చెక్కును రేవంత్‌రెడ్డికి అందజేశారు. విద్యార్థుల డేటాతో రూపొందించిన ఎక్విప్ స్కిల్ పోర్టల్‌ను సీఎం ఆవిష్కరించారు. కాగా, ప్రముఖ సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ రేవంత్‌రెడ్డిని సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

# వరదల నష్టం రూ.7,600 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

చేసిన సందర్భంగా విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'బోట్లను నదిలోకి వదిలి ప్రకాశం బ్యారేజీని ధ్వంసం చేసే ప్రయత్నం వెనుక వైసీపీ ఉంది. అందులో అనుమానమే అక్కర్లేదు. వీళ్లకు కొన్ని అలవాట్లు ఉన్నాయి. వీళ్లు చేసివేరే వాళ్లపై రుద్దుతారు. కృష్ణానదిలో విపరీతమైన వేగంతో వరద ప్రవహిస్తున్నప్పుడు 40 టన్నుల బరువున్న బోట్లను వదిలారు... అవి విపరీతమైన వేగంతో వచ్చి బ్యారేజీ స్తంభాలను ఢీకొట్టి ప్రాజెక్టు కూలిపోవాలని వారి ఆలోచన. కానీ అవి గేట్లపై ఉండే కౌంటర్ వెయిట్‌కు తగలడంతో అవి విరిగిపోయాయి. ఆ బోట్లను తీయడానికి నాలుగైదు రోజులు ఎంతో శ్రమపడాల్సి వచ్చింది. ఈ పని చేసినందుకు క్షమాపణ చెప్పరా? వాటిపై మీ బొమ్మలు, మీ పార్టీ రంగులు వేసుకున్నారు. ఆంబోతుల్లా దేశంపైకి వదిలి చూస్తూ కూర్చుంటారా? ఆ ప్రాజెక్టు కూలిపోతే ఎన్ని గ్రామాలు కొట్టుకుపోతాయి? ఎంత ప్రాణనష్టం వాటిల్లుతుంది. మీరు చేసిన పనులతో బుడమేరు కింద 6లక్షల మంది నరకయాతన అనుభవించారు. ఇప్పుడు మళ్లీ అనంతపురంలో రథం తగలబెట్టారు. ఒళ్లు దగ్గర పెట్టుకోమని హెచ్చరిస్తున్నాం. బీ కేర్‌ఫుల్. ప్రతిచోటా సీసీ కెమెరాలు పెట్టిస్తున్నాం. ఇలాంటి నేరాలు చేస్తే మక్కెలు విరగ్గొడతాం. ఇంటినుంచి బయటకు వచ్చిన మరుక్షణం చొక్కా పట్టుకొని తీసుకెళ్తాం. ఎంత గొప్పవాడైనా వదిలిపెట్టేది లే దు. ఎవరైనా దారి తప్పి నేరాలు చేయాలనుకుంటే అదే వారికి చివరి రోజు అవుతుం ది. శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడేది లేదు' అని చంద్రబాబు హెచ్చరించారు.

ఇటీవల రాష్ట్రాన్ని ముంచెత్తిన వరదల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు కలిపి రూ. 7,600 కోట్ల నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. వరదల్లో నష్టపోయిన 4లక్షల మంది బాధితులకు బుధవారం రూ. 602 కోట్ల పరిహారాన్ని ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'భారీవర్షాలు, వరదల ప్రభావం రాష్ట్రమంతా ఉంది. మొత్తం 16 జిల్లాల్లోని 902గ్రామాలు, కొన్ని నగరాలు, పట్టణాలు ప్రభావితమయ్యాయి. ఈ ప్రభావం 12 లక్షల మందిపై పడింది. 74 మంది మరణించారు. విజయవాడ చుట్టుపక్కల 45మంది మరణించారు. బాధితులను ఆదుకోవడానికి ఇప్పటి వరకూ రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 400కోట్ల విరాళాలు వచ్చాయి. వీల్‌చైర్లలో వచ్చి మరీ విరాళాలు ఇచ్చి వెళ్లారు. పాఠశాలల్లో విద్యార్థులు కూడా ఇచ్చారు. ఇది ఊహించనంత స్పందన. దాతలు అందరికీ నా పాదాభివందనం. విజయవాడలో వరద తీవ్రత చాలా అధికంగా ఉంది. బాధితులను ఆదుకోవడానికి పది రోజుల్లో 1. 15కోట్ల ఆహార పొట్లాలు, 1. 30కోట్ల నీళ్ల సీసాలు పంపిణీ చేశాం. 5వేల టన్నుల కూరగాయలు సబ్సిడీ ధరలకు విక్రయించాం. 150 డ్రోన్లను వాడాం. 75 వేల ఇళ్లలో బురదతో పాటు 330 కి.మీ. రోడ్లను ఫైర్‌ఇంజన్లతో శుభ్రం చేయించాం. 2లక్షల మందికి వైద్య సహాయం అందించాం. వరదల్లో వచ్చి పడిన మట్టి, చెత్తను ఎత్తి తరలిస్తే 20వేల టన్నులు అయింది. బాగా శుభ్రం చేయడం వల్ల వ్యాధులు ప్రబలడం తగ్గింది' అని చంద్రబాబు వివరించారు. వరదల్లో నష్టపోయిన వారికి చరిత్రలో ఏనాడూ లేనంత నష్టపరిహారం ఇచ్చామని ముఖ్యమంత్రి తెలిపారు. 'నీటమునిగిన గ్రౌండ్ ఫ్లోర్ ఇళ్లకు రూ. 11వేలు ఇవ్వాలని కేంద్రం సూచించింది. మేం రూ. 25వేలు ఇచ్చాం. చిన్న కిరాణా షాపులు, పరిశ్రమలకు రూ. 25వేల నుంచి రూ. 50వేల వరకూ ఇచ్చాం. బ్యాంకులు ఇప్పటికి రూ. 500కోట్ల మేర రుణాలు రీషెడ్యూల్ చేయడంతో పాటు కొన్ని కొత్త రుణాలు ఇచ్చాయి. బీమా కంపెనీలు ఈ నెల 30నాటికి వంద శాతం క్లెయిమ్‌లను పరిష్కరించాలని ఆదేశించాం. ఆ తేదీతో వరద బాధితుల సహాయానికి సంబంధించి అన్ని పనులు పూర్తికావాలని లక్ష్యంగా పెట్టుకొన్నాం. ఆ రోజు సాయంత్రం బాగా పనిచేసినవారికి అభినందన కార్యక్రమం నిర్వహిస్తాం' అని ఆయన చెప్పారు.

# హైడ్రా పేరుతో హైడ్రామాలు: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)



బ్లాక్ లిస్టు అయిన పాకిస్తాన్ కంపెనీకి మూసీ సుందరీకరణ కాంట్రాక్టు ఇచ్చి భారీ కుంభకోణానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ కుంభకోణానికి తెర లేపిన పెద్దల బాగోతాలను బయటకు తీస్తామని అన్నారు. బుధవారం ఫతేనగర్, ఖాజాకుంటలో మురుగునీటి శుద్ధి కేంద్రాలను (ఎస్‌టీపీలు) సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. 'హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో పేదలకు ఓ న్యాయం, పెద్దలకు ఓ న్యాయం జరుగుతోంది. వేదశ్రీ అనే ఏడేళ్ల పాప తన పాఠ్య పుస్తకాలు తీసుకోవటానికి కూడా సమయం ఇవ్వకుండా ఇళ్లు కూల్చివేశారు. కస్తూరి అనే మహిళ చెప్పుల దుకాణాన్ని కూడా కూల్చివేశారు. కోర్టు సెలవు దినాన కావాలని ఉదయమే వచ్చి అభాగ్యుల ఇళ్లను కూల్చివేస్తూ కోర్టులను అపహాస్యం చేస్తున్నారు. బఫర్ జోన్‌లో అనుమతులు ఇచ్చిన వారిని వదిలేసి, పేదల ఇళ్లను కూల్చివేయటం ఎంతవరకు సబబు? తమ ప్రభుత్వ హయాంలో పేదలకు లక్ష ఇళ్లు నిర్మించి ఇచ్చాం. మీకు చిత్తశుద్ధి ఉంటే పేదవారికి ఇళ్లు నిర్మించి ఇవ్వండి. మీ దౌర్జన్యాలను, దాష్టీకాలను ఇలాగే కొనసాగిస్తే ప్రజలు బుద్ధి చెబుతారు. జీహెచ్‌ఎంసీ, హైడ్రా ఆఫీసు, నీ అన్న ఇళ్లు బఫర్ జోన్‌లోనే ఉన్నాయి. మీ మంత్రుల ఫాంహౌస్‌లు కూడా బఫర్ జోన్‌లోనే ఉన్నాయి. అవసరమైతే ఫాంహౌస్‌ల వీడియోలు బయట పెడతాం. ముందు వాటిని కూలగొట్టి చిత్తశుద్ధి నిరూపించుకోవాలి. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరితో రియల్ ఎస్టేట్ వ్యాపారం 42 శాతానికి పడిపోయింది. ఎంతోమంది కార్మికులు ఉపాధి దొరకక ఖాళీగా ఉటున్నారు. హైడ్రా బాధితులందరికీ మేం అండగా ఉంటాం. ప్రజలు తెలంగాణ భవన్‌కు కూడా వచ్చి ఫిర్యాదులు ఇవ్వొచ్చు..'అని కేటీఆర్ తెలిపారు. 'మా ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో నాలాల పరిరక్షణతో పాటు రూ. 4 వేల కోట్లతో 31 ఎస్‌టీపీలను నిర్మించాం. కేవలం కూకట్‌పల్లిలో నియోజకవర్గంలోనే రూ. 350 కోట్లు ఖర్చు పెట్టాం. దక్షిణాసియాలోనే 100% మురుగునీటి శుద్ధి నగరంగా హైదరాబాద్ చరిత్ర సృష్టించబోతోంది. కేసీఆర్ సంకల్పం తీసుకుని ఈ పనులు పూర్తి చేశారు. గత 10 నెలల్లో ఈ ప్రభుత్వం ఏ ఒక్క మంచి పని కూడా చేపట్టలేదు..'అని కేటీఆర్ విమర్శించారు. హైదరాబాద్ ప్రజలు సంపూర్ణ ఆశీర్వాదం ఇచ్చి బీఆర్ఎస్‌ను గెలిపించినందుకు వారికి రుణపడి ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు మహమూద్ ఆలీ, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, మాగంటి గోపీనాథ్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, కేపీ వివేకానంద్, కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సొసైటీ చైర్మన్ బద్దం శశిధర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**శంకర్‌పల్లి: సెప్టెంబర్ 25: (డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి మండల సొసైటీ చైర్మన్ బద్దం శశిధర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. టిఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు విజయ్ కుమార్ మున్సిపల్ పరిధి ఆరవ వార్డు చిన్న శంకర్‌పల్లి లోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేశారు. అనంతరం విజయ్ కుమార్ మాట్లాడుతూ సొసైటీ చైర్మన్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని, మరెన్నో ఉన్నత పదవులను సాధించాలని రాజరాజేశ్వర స్వామిని వేడుకున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ డైరెక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.



## ఘనంగా సొసైటీ చైర్మన్ బద్దం శశిధర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**శంకర్‌పల్లి: సెప్టెంబర్ 25: (డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి మండల సొసైటీ చైర్మన్ బద్దం శశిధర్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. టిఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు విజయ్ కుమార్ మున్సిపల్ పరిధి ఆరవ వార్డు చిన్న శంకర్‌పల్లి లోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు నోటు పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేశారు. అనంతరం విజయ్ కుమార్ మాట్లాడుతూ సొసైటీ చైర్మన్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని, మరెన్నో ఉన్నత పదవులను సాధించాలని రాజరాజేశ్వర స్వామిని వేడుకున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ డైరెక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

## డెడ్రాలో స్వచ్ఛత సేవా సమావేశం

**అదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో:** బజార్ హత్నూర్ మండలం లోని డెడ్రా గ్రామ పంచాయతీ లో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛత హి సేవా కార్యక్రమం లో భాగంగా బుధవారం రోజు పంచాయతీ ఆవరణలో గ్రామస్తులు సమావేశ మ్ ఏర్పాటు చేశారు. స్వభావం స్వచ్ఛత,సంస్కారం స్వచ్ఛత గురించి చర్చలు జరిపారు. ఈ కార్యక్రమం లో పంచాయతీ సెక్రెటరీ సాయికృష్ణ, గ్రామ పటేల్ కుడ్మేత లింగు,మేస్రం బుజంగ్ రావ్,అంగన్వాడి దుర్వ సోనూబాయి,ఆశ వర్కర్,కోవా కౌశల్య బాయి,యూత్ ప్రసిడెంట్ కే.విశ్వనాథ్,గ్రామస్తులు తదితరలు పాల్గొన్నారు.





## పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

**శంకర్‌పల్లి: సెప్టెంబర్ 25: (డైలీ రిపోర్ట్):** స్వచ్ఛతా హి సేవ - 2024 కార్యక్రమంలో భాగంగా బుధవారం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు, మున్సిపల్ సిబ్బందికి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్, కమిషనర్ శ్రీనివాస్ లు హాజరై ప్రారంభించారు. సుమారు 140 మంది కార్మికులకు డాక్టర్లు పరీక్షలు నిర్వహించి, ఉచిత మందులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సేవలు ఎంతో విశిష్టమైనవని అన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డా. రేవతి రెడ్డి, డా. ప్రశాంతి, మున్సిపల్ మేనేజర్ అంజని కుమార్, ఇంచార్జ్ ఆర్ఐ చంద్రశేఖర్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## పేదలపై దాడులు సరికాదు

### బి ఆర్ ఎస్ యువ నాయకులు నవాజ్



**శంకర్ పల్లి సెప్టెంబర్ 25(డైలీ రిపోర్ట్):** హైదరాబాద్ నగరంలో చెరువులు, కుంటలు, నాలాల ఎఫ్.టి.ఎల్. బఫర్ జోన్లో ఉన్న అక్రమ నిర్మాణాలు కూల్చి వేయడానికి హైడ్రాను ఏర్పాటు చేసినట్లు రేవంత్ రెడ్డి ప్రభుత్వం చెబుతుంది. ఇప్పటికే హైడ్రాతో హైదరాబాద్ లోని అనేక ప్రాంతాల్లో ఉన్న నిర్మాణాలను నేలమట్టం చేస్తున్నది. ప్రభుత్వాల, అధికారుల అండతో ప్రభుత్వ, ప్రైవేట్ భూదందాలు జరిగినవి, వీరి మోసానికి గురై మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వర్గాలు ప్లాట్లు కొనుక్కున్నారు. నేడు వీరు బలి అవుతున్నారు. భూదందాల నుండి మోసానికి గురైన ఇటువంటి వర్గాల ఆస్తులకు రక్షణ కల్పించాలి. వీరికి ముందుగానే ప్రత్యామ్నాయం కల్పించాలి. అయితే అదే సందర్భంలో ఎన్నో ఏళ్లుగా జీవనోపాధి కోసం పేద ప్రజలు పెట్టుకున్న చిన్న షాపులను, వారు నివసిస్తున్న చిన్న ఇళ్లను కూడా కూల్చి వేస్తున్నారు. ప్రభుత్వం ఈ రకంగా పేద ప్రజలు నివాసముంటున్న ఇండ్లు, వారికి జీవన ఉపాధి కలిగిస్తున్నటువంటి చిన్న షాపులపై దాడులకు దిగడం దుర్మార్గమైనది. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పేద ప్రజలందరికీ పక్క ఇల్లు కట్టించేలా చర్యలు చేపట్టాలి. వారికి గౌరవప్రదమైన జీవనోపాధిని కల్పించాలి. తరతరాలుగా పేద ప్రజలు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక సమస్యలను పరిష్కరించాలి. యుద్ధానికి దిగినట్టు పేద, మధ్యతరగతి వర్గాలపై దాడులకు దిగడాన్ని బి ఆర్ ఎస్ యువ నాయకులు మహ్మద్ నవాజ్ ఖండిస్తుచారు. ఇలాంటి చర్యలకు పాల్పడకుండా హైడ్రాను నియంత్రించాలి. రియల్ ఎస్టేట్ భూ మాఫియాను పేద మధ్యతరగతి వర్గాలను ఒకేతీరుగా చూడరాదు. రియల్ ఎస్టేట్ భూమాఫియా ఆస్తులను స్వాధీనం చేసుకోవాలి. వీరి మోసాలకు గురైన వారికి ప్రభుత్వం ప్రత్యామ్నాయం కల్పించాలి. పేద, మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వర్గాలకి రక్షణ కల్పించాలి.

## సంగారెడ్డి జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశం



### అధికారులు అప్రమత్తంగా ఉండాలి.

### రెవెన్యూ అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్.

సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 25(డైలీ రిపోర్ట్): రానున్న రెండు రోజులు జిల్లాలో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. బుధవారం సాయంత్రం జిల్లాలోని రెవెన్యూ, మున్సిపల్ పంచాయతీ రాజ్ అధికారులు ఎంపీడీవోలతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారీ వర్షాల కారణంగా ఆకస్మికంగా వార్త వరద వచ్చే అవకాశం ఉన్న వాగులు కాలువల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశించారు ముఖ్యంగా నారాయణఖేడ్ , జహీరాబాద్, ఝూరాసంఘం, రాయికోడ్ ప్రాంతాలలో వాగులు వరదలు వచ్చే అవకాశం ఉన్నందున ఆయా మండలాల తహసిల్దారులు అప్రమత్తంగా ఉండాలని,మీ గ్రామాలలో వర్షాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. చెరువులు కుంటలు నిండి అలుగులు పారే అవకాశం ఉన్నందున నూతన ప్రాంతాల ప్రజలు అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.ఆర్ డి ఓ లు తాసిల్దారులు మున్సిపల్ అధికారులు ఎంపీడీవోలు వర్షా లు తగ్గుముఖం పట్టే వరకు అప్రమత్తతో ఉండాలని సూచించారు.



## పాశమైలారం పారిశ్రామికవాడలో వాహనాల రద్దీ నివారణకు జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ ఐపిఎస్ ప్రత్యేక చొరవ..



**పటాన్చెరువు డైలీ రిపోర్ట్ సెప్టెంబర్ 25 :** ఇస్నాపూర్, పఠాన్ చెర్వు బిరంగూడ చౌరస్తాల వద్ద ట్రాఫిక్ రద్దీని డ్రోన్ వ్యూ ద్వారా ఎస్పీ గారు ప్రత్యేకంగా పర్యవేక్షించడం జరిగింది. రోజూ ఉదయం సాయంత్రం స్కూల్, కళాశాలల బస్సులు ఉద్యోగస్తుల ప్రయాణాలతో పాటు పరిశ్రమల భారీ వాహనాలు గూడ్స్ వెహికల్స్ ఒక్కసారిగా రావడంతో ప్రజలు ట్రాఫిక్ సమస్యలను ఎదుర్కొంటున్నారని ఈ సమస్యను అధిగమించడానికి ఉదయం, సాయంత్రం స్కూల్, కళాశాలల బస్సులు వచ్చే సమయంలో పరిశ్రమల వాహనాలను రాకుండా చూడటం జరుగుతుందని అన్నారు. ఇందులో భాగంగానే SSSC ఆధ్వర్యంలో ట్రాఫిక్ నియంత్రణకై ట్రాఫిక్ మార్షల్స్ పేరుతో ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేసి ట్రాఫిక్ రద్దీని నియంత్రించడం జరుగుతుందన్నారు. ట్రాఫిక్ రద్దీగా ఉన్న ప్రదేశాలలో స్పెషల్ ట్రాఫిక్ వాహనాలతో పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ గారి వెంబడి పఠాన్ చెర్వు డీఎస్పీ రవీందర్ రెడ్డి, %బూబాజ% జనరల్ సెక్రటరీ సత్యనారాయణ ఇన్స్పెక్టర్ లాలు నాయక్, ప్రవీణ్ రెడ్డి, స్వామి గౌడ్ తదితరులు ఉన్నారు.



## పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

### 16 మంది జూదారుల అరెస్ట్



**అదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో:-** జైనథ్ మండలం అనంద్పూర్, కూర, దీపాయిగూడ గ్రామాల్లో పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు జైన సబ్ ఇన్స్పెక్టర్ వి పురుషోత్తం తన సిబ్బందితో కలిసి దాడి చేయగా పేకాట ఆడుతున్న అనంద్పూర్ కు చెందిన ఏడుగురిని కూరాకు చెందిన ఆరుగురిని, దీపాయ కూడా కు చెందిన ముగ్గురిని (ఇద్దరి పరారీ) అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 52 పేకాముక్కలు నగదు మొత్తం 18,980 రూపాయలు సీజ్ చేయడం జరిగింది. మండలంలోని ఎక్కడ పేకాట మట్కా గుట్కా గంజాయి వంటి అసాంఘిక కార్యక్రమాలకు తాగు లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అట్టివారిపై ఉక్కు పాదం మోపాలని ఆదిలాబాద్ జిల్లా డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి జైనథ్ సిఐడి సాయినాథ్ తెలిపారు. జైనథ్ ఎస్ఐ మరియు సిబ్బంది శివాజీ శ్రీనివాస్ స్వామి నాయక్ లను అభినందించారు జైనథ్ మండలంలో ఎక్కడైనా పేకాట మట్కా గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నట్లు అయితే సమాచారం జైనథ్ సిఐ 8712659916, జైనథ్ ఎస్సై 8712659929లకు సమాచారం ఇవ్వగలరని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.



# బదిలీ పై వెళ్లిన 17 మంది ఉపాధ్యాయులకు సన్మానం

**అదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో:** బజార్ హత్నూర్ మండల పరిధిలో గల జాతర్ల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బుధవారం రోజు బదిలీ పై వెళ్లిన 17 మంది ఉపాధ్యాయులకు సన్మానం చేశారు.బదిలీ పై ప్రధాన ఉపాధ్యాయులు జి.చందన్, కోవ శ్రీనివాస్, గంగయ్య, రామారావ్, నాగోరావ్, ఉత్తమ్, గోవింద్, గజానంద్, వంశీ, బాజీరావ్, గోపాల్ తదితరులు వెళ్లగా పాఠశాల ప్రధాన ఆచార్యులు కిషన్ రెడ్డి, భూమన్న, దేవరావు, సంతోష్, అనిత, శ్రీధర్,సంతోష్, విద్యార్థులు, సిబ్బంది కల్సి ఈ కార్యక్రమం ఏర్పాటు చేసి ఘనంగా సన్మానం చేశారు.

# విద్యార్థులకు సామాజిక బాధ్యత ఉందా....?

విద్యార్థులలో మానవతా విలువలు మర్చిపోవాల్సిందేనా...?

విద్యార్థులకు నైతిక విలువలు కలిగి ఉన్నాయా....?

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేది ఎవరూ..?

ఉపాధ్యాయులా..? తల్లిదండ్రులా......?

ప్రభుత్వమా......?



**అదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో :-** విద్యార్థుల సామాజిక అవగాహన లోపం వల్ల ఇటు సమాజంపై అటు రక్త సంబంధాలపై ఏ మాత్రం అవగాహన లేకుండా ఇలా ప్రవర్తించాలో తెలియని అయోమయం స్థితిలో ఉన్న ఇప్పటి జనరేషన్ విద్యార్థులను చూస్తుంటే కొంతకాలం తర్వాత రక్త సంబంధాలు అనేవి క్రమానుసారంగా అంతరించి పోతాయి అనడానికి నిలువెత్తు నిదర్శనం ఇప్పటి చదువుకుంటున్న విద్యార్థుల లోకం. ఇప్పటి చదువుకుంటున్న విద్యార్థులలో నీతి నియమాలతో కూడిన మానవతా విలువలు కలిగిన సామాజిక స్పృహను, పెద్దలను గౌరవించడం , చిన్నవారితోనే స్నేహపూర్వకంగా ఉండటం , కలిగించే విద్యను అందించాలి. యువత అత్యధికంగా కలిగి ఉన్న దేశం మన దేశమే కాబట్టి యువత అత్యంత శక్తిగా ఎదగాలంటే తప్పనిసరిగా క్రమశిక్షణ అవసరం. అప్పుడే నా దేశం గొప్ప దేశంగా గర్వంగా చెప్పగలుగుతాము . అప్పుడు అన్ని రంగాల్లో భారతదేశం మొట్టమొదటి స్థానాన్ని కైవసం చేసుకుంటుంది.

**విద్యార్థులకు మానవతా విలువలు కలిగి ఉన్నాయా..?**

అనేదానికి ముక్కు సూటిగా చెప్పాలంటే ఈ యొక్క సమాజంలో ఏ ఒక్క విద్యార్థికి మానవత విలువలు లేవని చెప్పవచ్చు. ఎందుకంటే ప్రస్తుతం ఉన్నటువంటి దూకుడు తనం, స్వార్థం, ఎదుటివారిని చులకనగా చూడటం, పెద్దలను మర్యాదపూర్వకంగా గౌరవించకపోవడం, ఇలా చెప్పుకుంటూ పోతే ఒక వ్యక్తికి మరో వ్యక్తికి మధ్య ఉన్న సత్సంబంధాలు పూర్తిగా తెగిపోయాయని చెప్పవచ్చు. ఈ రోజుల్లో 5జి స్పీడ్ తో దూసుకుపోతున్న దేశంలో ఇంటర్నెట్ ను ఉపయోగించుకుంటూ విద్యార్థులు తమ భవిష్యత్తుకు మంచి మార్గాల్లో అనేకమైన ఓ ఒత్తిళ్ళ లోగిళ్ళలో ఎన్నో తప్పటడుగులు వేస్తూ తమ ప్రాణాలనే ప్రాణంగా పెడుతున్నారు. అనేదానికి చాలా ఉదాహరణలు ఉన్నాయి. కాబట్టి విద్యార్థులు ముఖ్యంగా సామాజిక స్పృహ తోటి వారితో ఎలా మెరుగాలి అని తెలుసుకుంటే అన్ని తనంతట తానే నేర్చుకోగలుగుతాడు. సమాజానికి ఒక కేంద్రబిందువుగా ఒక వ్యక్తి నుండి శక్తిగా ఎదుగుతాడు అనడంలో ఎంతోమంది ఉదాహరణలు ఉన్నాయి .విద్యార్థుల్లో నైతిక విలువలు ఉన్నాయా అనే అంశంపై మాట్లాడాలంటే ఈ రోజుల్లో నైతిక విలువలు పూర్తిగా సన్న గిల్లుతున్నాయి అనడానికి చాలా ఉదాహరణలు ఉన్నాయి. ప్రతి విద్యార్థికి ఒక స్మార్ట్ ఫోన్ తప్పనిసరి వస్తువు అయిపోయింది. విద్యార్థులు తమ స్మార్ట్ ఫోన్లలో అశ్లీలదృశ్యాలు చూస్తూ, మత్తు పానీయాలకు బానిసలు అవుతూ, సోమరులుగా పనిచేతకాక ,ఏ పని చేయాలో తోచక ఎంతో మంది విద్యార్థులు రోడ్లమీద దర్శనమిస్తున్నారు. మరి ఇలాంటి విద్యార్థులకు మార్గదర్శకాలు చూపాల్సింది ఎవరు...!.?

విద్యార్థుల్లో అసలు

**సమాజం మీద అవగాహన లేకపోవడం. చాలా దురదృష్టకరం. . !**

ఇంతసేపు విద్యార్థులు తమ స్వార్థం కోసమే తప్ప, సామాజిక కోసం పట్టించుకునే సమయము, తీరిక అసలు లేదంటే ఎంత సామాజిక అవగాహన ఉందో అర్థమవుతుంది.విద్యార్థుల యొక్క బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాల్సింది ఎవరు. ...! విద్యార్థుల చక్కని బంగారు భవిష్యత్తును అందాకారం చేస్తుంది ముమ్మాటికి తల్లిదండ్రుల పెంపకమే...!

ఎందుకంటే తల్లిదండ్రులు తమబిడ్డలను అల్లారుముద్దుగా, ఏ కష్టం బాధ తెలియనీయకుండా, బాధ్యత రహితంగా పెంచుతున్నారో మన కళ్ళ ముందు ఎన్నో దర్శనాలు చేస్తున్నాం. తల్లిదండ్రులు పిల్లల యొక్క బంగారు భవిష్యత్తు కోసం రాత్రి బవల్లు కష్టపడతారు కానీ పిల్లల యొక్క మంచి చెడులు అరచుకోవడానికి తీరిక ఉండదు. కాబట్టి పిల్లలకు ఎటువంటి కట్టుబాట్లు చెప్పకుండా వాళ్లను ఇష్టానుసారంగా పెంచడం వల్ల చివరికి ఏమవుతాడో..?

**ఎలా పెరుగుతాడో.....?**

**సమాజానికి ఇలాంటి పని చేస్తాడో. ..?**

ఎలాంటి సమస్య తెస్తాడో..?. తెలియని పరిస్థితి..! తల్లిదండ్రులు ఇప్పటికైనా మారి తమ యొక్క పిల్లల భవిష్యత్తు కోసం కఠినమైన నిర్ణయాలు తీసుకోవడం ఈ సమాజ శ్రేయస్సుకోసం ఎంతైనా ఉంది. ఇలాంటి పిల్లలను ఉపాధ్యాయులు , గుర్తించి విద్యార్థుల యొక్క శైలిలో మార్పు వచ్చే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సరైన మార్గనిర్దేశకాలు చేస్తూ, అతనికి దిశా నిర్దేశించడంలో ఒక ఒక మంచి విద్యార్థిగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయునిపై ఎంతైనా ఉంది . ముఖ్యంగా ప్రభుత్వం కూడా ఇలాంటి విద్యార్థులకు చొరవ తీసుకొని ప్రత్యేక శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి మానసికంగా ఒత్తిళ్లకు గురైన వాళ్లకు ప్రత్యేకంగా కౌన్సిలింగ్ ఇప్పించి తగిన శ్రద్ధ చూపించాలి. విద్యార్థులను మత్తు పానీయాలు నుండి అశ్లీల ప్రపంచం నుండి మెల్లమెల్లగా దూరం చేస్తూ,విద్యార్థుల యొక్క సృజనాత్మకతను వెలికితీయటంలో ప్రభుత్వం తక్షణమే రంగంలోకి దిగి విద్యార్థులకు కౌన్సిలింగ్ ఏర్పాటు చేసే ప్రక్రియను వేగవంతం చేయాల్సిందిగా కోరుతున్నాను

**అల్లం సాయికిరణ్ రెడ్డి జర్నలిస్ట్**

# నైపుణ్య అభివృద్ధికి డ్యూటీ మీట్ ల నిర్వహణ - జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఐపిఎస్

## ఆరు అంశాలలో పోలీసు సిబ్బందికి పరీక్షలు.

**కేసుల దర్యాప్తు, పరిశోధన, ఫింగర్ ప్రింట్స్, డాగ్ స్క్వాడ్, బాంబు డిస్పోజల్ టీం, ఫోటోగ్రఫీ వీడియోగ్రఫీ లాంటి అంశాలలో పరీక్షలు.**

**పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి రివార్డులు, జోనల్ స్థాయికి ఎంపిక.**






అదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో: పోలీసు అధికారులు మరియు సిబ్బంది యొక్క పనితనాన్ని మెరుగుపరిచేందుకు, పెంపొందించేందుకు జిల్లా స్థాయి జోనల్ స్థాయి రాష్ట్రస్థాయి జాతీయస్థాయి పోలీస్ డ్యూటీ మీట్ లను నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఐపిఎస్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీసు హెడ్ క్వార్టర్స్ నందు ఆదిలాబాద్ జిల్లా స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ ను జిల్లా ఎస్పీ ప్రారంభించారు. ఈ డ్యూటీ మీట్ నందు ముఖ్యంగా నేర పరిశోధన, నేర స్థల పరిశోధన, విఐపి మూమెంట్, యాంటీ సబటిజ్ చెక్, డాగ్ స్క్వాడ్ యొక్క పనితనం, ఫింగర్ ప్రింట్ పై పరిశోధన, బాంబు డిస్పోజల్ టీం యొక్క విధులు, కంప్యూటర్ పై నైపుణ్యం, నేరా స్థలం నందు ఫోటోగ్రఫీ, అవాంఛనీయ సంఘటనలో సంభవించినప్పుడు వీడియోగ్రఫీ చేయు విధానం లాంటి అంశాలలో రాత పరీక్ష మరియు మౌఖిక పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి జిల్లా స్థాయిలో నగదు రివార్డులను అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ పరీక్షలు కొన్ని అంశాలు ఇన్స్పెక్టర్ మరియు సబ్ ఇన్స్పెక్టర్ స్థాయి వారికి, మరికొన్ని అంశాలు ఏఎస్ఐ నుండి కానిస్టేబుల్ వరకు జరుగుతాయని తెలిపారు. జాతీయస్థాయిలో మొదటి, బహుమతి ద్వితీయ, బహుమతి తృతీయ, బహుమతి పొందిన వారికి జాతీయ స్థాయి నుండి అత్యధిక నగదు బహుమతిని లభించడం జరుగుతుందని తెలిపారు. ఇలాంటి డ్యూటీ మీట్ లలో పాల్గొన్నప్పుడు తమకు ఉన్న నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవచ్చని, ప్రస్తుత సమాజంలో నేరగాళ్లు ఉపయోగిస్తున్న నూతన పద్ధతులను తెలుసుకోవచ్చని, నూతన చట్టాలపై అవగాహన పెంపొందించుకోవచ్చని, ట్రైనింగ్ నందు వాస్తవానికి ఉన్న భేదాలను గమనించవచ్చని, నేరం జరుగు పద్ధతులను పరిశోధించే పద్ధతులను వివరంగా అర్థం చేసుకొని తమ విధులను ఉపయోగకరంగా ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. ఎలాంటి సందేహాలు ఉన్న ఉన్నతాధికారులు మరియు అనుభవం ఉన్న అధికారుల ద్వారా నివృత్తి అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆపరేషన్ బి సురేందర్రావు, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, హసీబుల్లా, బి సురేందర్ రెడ్డి, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, రిజర్వేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# ప్రతి ఒక్క ఆయుధంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి - జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఐపిఎస్.

**ఆయుధ పరిజ్ఞానంపై శిక్షణ పోలీసు కానిస్టేబుల్ లకు వివరించిన జిల్లా ఎస్పీ.**

**అవాంఛనీయ సంఘటన పై, సంఘవిద్రవ శక్తులపై పోరాడే ప్రతిమను, మెలుకువలను శిక్షణ కానిస్టేబుల్ నేర్పిన జిల్లా ఎస్పీ.**

**ఫైరింగ్ రేంజ్ నందు ఫైరింగ్ లో పాల్గొన్న జిల్లా ఎస్పీ.**

**అదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో:** తలమడుగు మండలం సుంకిడి గ్రామం నందు గల ఫైరింగ్ రేంజ్ నందు శిక్షణ కానిస్టేబుల్ లకు ఆయుధాలపై పూర్తి పరిజ్ఞానం అందించాలని జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఐపిఎస్ స్వయంగా ఫైరింగ్ రేంజ్ నందు ఫైరింగ్ కార్యక్రమంలో పాల్గొని ఫైరింగ్ నందు ఉన్న మెలుకువలు, ఫైరింగ్ చేయు విధానాలపై సిబ్బందికి తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ అవాంఛనీయ సంఘటనలను చోటు చేసుకున్నప్పుడు, అల్లరి మూకలపై, వివిధ సందర్భాలలో పోలీసు సిబ్బంది చేయు విధులు, టియర్ గ్యాస్, స్టన్ గ్రానైట్, వజ్రా వాహనం నందు గ్యాస్ గ్రానైట్ ప్రయోగం లాంటి అంశాలను శిక్షణ కానిస్టేబుల్ లకు జిల్లా ఎస్పీ సవివరంగా వివరించారు. అదేవిధంగా ఫైరింగ్ చేయునప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు విధివిధానాలపై సిబ్బందికి తెలియజేశారు. ఫైరింగ్ పొజిషన్స్ మరియు శత్రువుల పై దాడి చేయు విధానాలు తదితర అంశాలను జిల్లా ఎస్పీ వివరించారు. ఈ శిక్షణ కానిస్టేబుల్ కు శిక్షణ నందు పూర్తి అవగాహన కల్పించినప్పుడు రేపటి సమాజంలో వీరు ఎలాంటి సందేహాలు, నిర్భయంగా లేకుండా విధులను నిర్వర్తించగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆపరేషన్ బి సురేందర్ రావు, డీఎస్పీలు ఎల్ జీవన్ రెడ్డి, పోతారం శ్రీనివాస్, పోలీసు శిక్షణ కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మోహన్ బాబు ఇంట్లో దొంగతనం



**హైదారాబాద్, సెప్టెంబర్ 25(డైలీ రిపోర్ట్):** సీనియర్ నటుడు , కలెక్షన్ కింగ్ మోహన్ బాబు ఇంట్లో దొంగతనం జరిగింది. ఇంట్లో పని చేస్తున్న వ్యక్తే దొంగతనం చేశాడని సమాచారం. హైదరాబాద్ శివారులోని జల్ పల్లిలో ఉన్న మోహన్ బాబు ఇంట్లో దొంగతనం జరిగింది ఆయన ఇంట్లో పని చేస్తున్న గణేష్ నాయక్ అనే వ్యక్తి డబ్బును దొంగిలించాడు. రూ. 10 లక్షల రూపాయిల డబ్బును దొంగలించి పారిపోయాడని తెలుస్తోంది. దొంగతనం జరగడంతో మోహన్ బాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చివరకు పట్టుబడ్డాడు.మోహన్ బాబు ఇంట్లో ఎన్నో ఏళ్లుగా గణేశ్ అనే వ్యక్తి పని చేస్తున్నాడు. ఆ వ్యక్తే దొంగతనానికి పాల్పడ్డాడు. మోహన్ బాబు వద్ద నమ్మకంగా ఉంటూనే చోరీ చేసేందుకు గణేశ్ ప్లాన్ వేశాడు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి రూ. 10 లక్షల రూపాయలు తీసుకుని వెళ్లిపోయాడు. ఆ తర్వాత గణేశ్ కనిపించలేదు. అనుమానం వచ్చి చూడగా రూ. 10 లక్షలు మాయమైనట్టు అర్దమై వెంటనే పోలీస్ లను సంప్రదించారు. మోహన్ బాబు ఇంట్లో ఎన్నో ఏళ్లుగా గణేశ్ అనే వ్యక్తి పని చేస్తున్నాడు. ఆ వ్యక్తే దొంగతనానికి పాల్పడ్డాడు. మోహన్ బాబు వద్ద నమ్మకంగా ఉంటూనే చోరీ చేసేందుకు గణేశ్ ప్లాన్ వేశాడు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి రూ. 10 లక్షల రూపాయలు తీసుకుని వెళ్లిపోయాడు. ఆ తర్వాత గణేశ్ కనిపించలేదు. అనుమానం వచ్చి చూడగా రూ. 10 లక్షలు మాయమైనట్టు అర్దమై వెంటనే పోలీస్ లను సంప్రదించారు. పహాడిషరీఫ్ పోలీసులకు మోహన్ బాబు మేనేజర్ కిరణ్ తేజ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు... గణేశ్ కోసం గాలించారు. తిరుపతిలో ఇవాళ ఉదయం మోహన్ బాబు ఇంటి పనిమనిషి(ఎవరైతే దొంగతనం చేశాడో) నాయక్ ను పట్టుకున్నారు రాచకొండ పోలీసులు. ప్రస్తుతం అతన్ని హైదరాబాద్ కి తరలిస్తున్నారు. మోహన్ బాబు ప్రస్తుతం కన్నప్ప సినిమాలో నటిస్తున్నారు. అలాగే ఈ సినిమాను నిర్మిస్తున్నారు కూడా.. ఈ సినిమాలో మంచు విష్ణు హీరోగా నటిస్తున్నాడు. హిస్టారికల్ కంటెంట్ తో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో చాలా మంది స్టార్స్ నటిస్తున్నారు. బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్‌తో పాటు టాలీవుడ్ రెబల్ స్టార్ ప్రభాస్ కూడా అతిథి పాత్రలో కనిపించనున్నాడు.





# అంతరాష్ట్ర గంజాయి ముఠా సభ్యుల అరెస్ట్

## 292 ప్యాకెట్లలోని దాదాపు 900 కిలోల, రూ 2.25 కోట్ల విలువగల గంజాయి స్వాధీనం.

## 8 మంది పై కేసు నమోదు, ఇద్దరు అరెస్ట్, గంజాయి కంటైనర్, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం.

## చాకచక్యంగా గంజాయి ముఠా సభ్యులను అరెస్టు చేసిన జిల్లా పోలీసులు.

## ఆంధ్ర ఒరిస్సా బార్డర్ నుండి మహారాష్ట్రలోని బుల్దాన, దూలే జిల్లాలకు తరలిస్తున్న గంజాయి.

## పత్రికా సమావేశంలో వివరాలను వెల్లడించిన జిల్లా ఎస్పి గౌష్ ఆలం ఐపిఎస్.

**అదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో:** జిల్లా పోలీసు శాఖ చాకచక్య తీరుతో దాదాపు 900 కిలోల గంజాయిని ఆదిలాబాద్ జిల్లా తలమడుగు పోలీస్ స్టేషన్ పరిధిలోని మహారాష్ట్ర సరిహద్దుతో ఉన్న లక్ష్మీపూర్ చెక్ పోస్ట్ వద్ద స్వాధీనం చేసుకోవడం జరిగిందని జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఐపిఎస్, తలమడుగు పోలీస్ స్టేషన్ నందు ఏర్పాటు చేసిన పాత్రికా సమావేశంలో వివరాలను వివరించారు.

**నిందితులు**

A1) ఆశిష్, మల్కాన్ గిరి, ఒడిస్సా రాష్ట్రం, ముఖ్యమైన సప్లయర్. (పరారీ)
A2) పండిత్ జి, కసంపూర్ మీరుట్, ఉత్తరప్రదేశ్,(పరారీ)
A3) వసీం ఏవసీం అన్సారి, ఉత్తర ప్రదేశ్, కంటైనర్ లారీ డ్రైవర్. (అరెస్ట్)
A4) అర్మాన్, ఉత్తర ప్రదేశ్, కంటైనర్ లారీ క్లీనర్. (అరెస్ట్)
A5), A6) గుర్తుతెలియని వ్యక్తులు బుల్దాన, దూలే జిల్లా, మహారాష్ట్ర చెందిన వ్యక్తులు. (పరారీ)
A7) అన్ను జైన్,(పరారీ) ఉత్తరాఖండ్. A8) సోను అన్సారి, (పరారీ)

తలమడుగు పోలీస్ స్టేషన్ నందు నిందితులపై క్రైమ్ నెంబర్ 104/2024 %ఖ/ావష 8(ప) తీ/ష 20(ఎ)(అఱ)(ఎ%) ఆఫ్ NDPS Act 1985 తో కేసు నమోదు చేయబడిందని తెలిపారు.

**కేసు వివరాలలో**

ఆంధ్ర-ఒరిస్సా బోర్డర్ అటవీ ప్రాంతం నుండి పెద్ద ఎత్తున గంజాయి దేశంలోని వివిధ రాష్ట్రాలకు సరఫరా చేస్తున్న అంతరాష్ట్ర ముఠా సభ్యులను ఈరోజు తలమడుగు మండలం లక్ష్మీపూర్ చెక్ పోస్ట్ వద్ద ఆదిలాబాద్ రూరల్ సర్కిల్ పోలీసుల పట్టుకోవడం జరిగిందని జిల్లా ఎస్పీ వివరాలను వెల్లడించారు. పెద్ద ఎత్తున గంజాయి తరలుతోందని పక్కా సమాచారంతో ఈరోజు ఉదయం వాహనాలను తనిఖీ చేయుచుండగా ఉత్తరాఖండ్కు చెందిన ఒక ఐచర్ కంటైనర్ వాహనం నంబర్ UK08CB%5318 ఆదిలాబాద్ పట్టణం వైపు నుండి మహారాష్ట్ర వైపు వెళ్లగా పోలీసుల ఆ వాహనాన్ని చెక్పోస్ట్ వద్ద ఆపి తనిఖీ చేయగా అందులో ఒక డ్రైవర్ మరియు క్లీనర్లు ఉన్నారు. పోలీసులు వారిని ప్రశ్నించగా డ్రైవర్ పేరు A3 వసీమ్ మరియు క్లీనర్ %ూ%4 అర్మాన్ అని తెలిపినారు. పోలీసులు డ్రైవర్ వసీమ్ విచారించగా అతడు ఉత్తరాఖండ్లోని హరిద్వార్ కు చెందిన %ూ%7 అన్ను జైన్, ఉత్తరప్రదేశ్ కు చెందిన A2 పండిత్ జి,A8 సోను అన్సారి, మిత్రులందరికీ గత



మూడు సంవత్సరాలుగా గంజాయి వ్యాపారం చేస్తున్నామని, అతను గత సంవత్సరం చత్తీస్ ఘడ్ రాష్ట్రంలోని రాయపూర్, సుక్మా, జగదల్ పూర్ జిల్లాల అటవీ ప్రాంతం నుండి చాలాసార్లు తన వాహనంలో గంజాయిని తీసుకువచ్చి పై ముగ్గురికి ఇవ్వడం జరిగిందని తెలిపారు. నేను గంజాయి ని తెచ్చి వారికి ఇచ్చినందున వారు నాకు పెద్ద ఎత్తున డబ్బులు ఇచ్చి వారు దానిని ఇతరులకు అమ్మడం సాధారణంగా జరుగుతుందని తెలిపారు. వసీం తెలిపిన వివరాల ప్రకారం పది రోజుల క్రితం పండిత్ జి, అతనికి పరిచయమైన ఆశిష్, మల్కాన్ గిరి ఒడిస్సా అతనితో మాట్లాడి నాకు చెప్పినాడు ఆంధ్ర ఆడిషా బార్డర్ అటవీ ప్రాంతం లో 900 కిలోల గంజాయి ఉంది మహారాష్ట్రలోని బుల్దానా జిల్లాకు చెందిన ఒక పార్టీకి మరియు మాలే జిల్లాకు చెందిన ఒక పార్టీకి గంజాయి అవసరం ఉంది అని రూ 1,50,000/- ఇస్తాం అని అనగా వసీం ఒప్పుకొని క్లీనర్ అయిన అర్మాన్ కు కూడా ఈ విషయం చెప్పి తన యొక్క ఐచర్ వాహనంలో తాను మరియు అర్మాన్, ఆశిష్ మరియు పండిత్ జీ లతో ఫోన్ కాల్ ద్వారా మాట్లాడి భద్రాచలం మారేడుపల్లి, చింతూరు ద్వారా ఆశిష్ చెప్పిన అటవీ ప్రాంతం ఆంధ్ర ఒడిశా బార్డర్ కు వెళ్ళగా అక్కడ ఆశిష్ కు కలిసి వారి మనుషులతో గంజాయి నింపిన ప్యాకెట్లు గల 36 బ్యాగులను వసీంకు చూపించి కంటైనర్ లో నింపడం జరిగింది. ఆశిష్ చెప్పిన కంటైనర్ వాహనం ముందు పైలెట్ వాహనంగా గంజాయి ఇవ్వాల్సిన పార్టీకి చెందిన ఒక వ్యక్తి కారులో ముందు పైలెట్ గా ఉంటాడు అని ఏదైనా సమస్య ఉంటే తాను చూసుకుంటాడని వెంటనే ఆ వాహనం నాకు తెలియజేయు దాని ప్రకారం వెళ్దామని ఆశిష్ చెప్పడం జరిగింది. ఆశిష్ కొన్ని డబ్బులు ఇచ్చి మిగతా డబ్బులు బుల్దాన, దూలె గంజాయి తరలించిన తర్వాత ఇస్తాను అని చెప్పడం జరిగింది. వసీం గంజాయి నింపుకుని వరంగల్ కరీంనగర్ మీదుగా పైలెట్ వాహనం వచ్చిన రూట్లో వస్తూ మహారాష్ట్రలోని బుల్దానాకు వెళుతున్నప్పుడు ఇక్కడ పోలీసు వారు పట్టుకోవడం జరిగిందని జిల్లా ఎస్పీ తెలిపారు. పైలెట్ వాహనం కారు ముందు వెళ్లడం జరిగింది వసీం చెప్పిన దాని ప్రకారం పంచుల ఎదుట వాటిని పరిశీలించగా అందులో ఐదు కిలోలు మరియు రెండు కిలోల కు చెందిన మొత్తం 292 ప్యాకెట్లు కలవు. వాటి తూకం వేయగా దాదాపు 900 కిలోల వరకు గంజాయి కలదు అని తెలిపారు. నిందితులను విచారించగా పై వివరాలను తెలియజేశారని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఈ గంజాయి మార్కెట్ విలువ కిలో దాదాపు 25 వేల రూపాయలకు అమ్మ వచ్చని నిందితులు తెలిపారు. వీటి విలువ 2 కోట్ల 25 లక్షల వరకు ఉంటుందని తెలిపారు.

### నిందితుల వద్ద నుండి స్వాధీనం చేసుకున్న వస్తువులు

1) ఐచర్ కంటైనర్, No : UK08CB5318,
2) 292 ప్యాకెట్లు కలిగిన (డ్రై) ఎండిన గంజాయి, దాదాపు 900 కిలోల బరువు, దాదాపు రెండు కోట్ల 25 లక్షల విలువ.
3) రెండు మొబైల్ ఫోన్లు. గంజాయిని పెద్ద మొత్తంలో వాణిజ్యానికి తరలిస్తూ, విక్రయిస్తూ మరియు కొంటున్న మిగిలిన అంతరాష్ట్ర ముఠా సభ్యులను పట్టుకునేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక బృందాలను నియమించి అరెస్టు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో గంజాయిని పట్టుకోవడం జిల్లాలో ఇదే మొదటిదని పేర్కొన్నారు. ఈ ముఠా సభ్యులు అరెస్టు చేయడంలో, కేసు నమోదులో కీలకపాత్ర పోషించిన ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, డిసిఆర్బి డిఎస్పి బి సురేందర్ రెడ్డి లను మరియు అంతరాష్ట్ర గంజాయి స్మగ్లర్ల ముఠాను చాకచక్యంగా పట్టుకున్న ఆదిలాబాద్ రూరల్ సీఐ కే ఫణిధర్, సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, జైనథ్ సీఐ డి సాయినాథ్, ఆదిలాబాద్ రూరల్ సర్కిల్ ఎస్సైలు అంజమ్మ, ముజాహిద్, విష్ణువర్ధన్, మరియు సిసిఎస్ రూరల్ సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, నగదు బహుమతి అందించి ప్రోత్సహించారు.

# తాగిన మైకంలో ఇంటిముందు మూత్ర విసర్జన

## చితకబాదిన కాలనీ వాసులు...వ్యక్తి పరిస్థితి విషమం

## సిసి టీవీ కెమెరాల ఆధారంగా పోలీసుల కేసు నమోదు

అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం మత్తులో ఓ వ్యక్తి చేసిన పని అతని ప్రాణాల మీదకు తెచ్చింది. తప్పతాగిన అజయ్ అనే వ్యక్తి ఓ ఇంటి ముందు మూత్రం పోయడం తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. అతను చేసిన పనికి కాలనీవాసులంతా మూకుమ్మడిగా దాడి చేశారు. రాళ్లు, కర్రలతో విచక్షణారహితంగా కొట్టడంతో బాధితుడికి తీవ్రగాయాలు అయ్యాయి. దీంతో అతని పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈనెల 23న జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధి నాగిరెడ్డి కాలనీలో దారుణ ఘటన వెలుగు చూసింది. అజయ్, మోహన్ రెడ్డి అనే ఇద్దరు వ్యక్తులు పూటుగా మద్యం సేవించారు. మద్యం మత్తులో అజయ్ ఓ ఇంటి ముందు మూత్రం పోశాడు. ఈ ఘటనను చూసిన స్థానికులు అతని చేష్టలను తీవ్రంగా ఖండించారు. తమ ఇళ్ల వద్దకు వచ్చి ఇలాంటి పనులు చేయడం ఏంటని ప్రశ్నించారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం జరిగింది. కోపోద్రిక్తులైన కాలనీ వాసులు వారిద్దరిపై దాడి చేశారు. విచక్షణా రహితంగా పెద్దపెద్ద కర్రలు, రాళ్లతో దాడి చేశారు. అజయ్ చొక్కా చింపేసి మరీ తీవ్రంగా గాయపరిచారు. బాధితుడు తీవ్రగాయాలతో కిందపడిపోయినా వదలకుండా ఇష్టానుసారంగా కొట్టారు. దీంతో అజయ్ తీవ్రంగా గాయపడ్డారు. దాడిలో మోహన్ రెడ్డికి సైతం తీవ్రగాయాలు అయ్యాయి. మొత్తం ఘర్షణకు సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు బాధితులను ఆస్పత్రికి తరలించారు. అయితే తల, ఇతర శరీర భాగాలు తీవ్రంగా దెబ్బతినడంతో అజయ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. మరో బాధితుడు మోహన్ రెడ్డి సైతం చికిత్సపొందుతున్నాడు.



Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707